# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 315 ఆదివారం 7 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## నిర్మలా సీతారామన్ రికార్డు!

- వరుసగా ఏడోసారి లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న ఆర్థిక మంత్రి!
- ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మూడో ప్రభుత్వ ప్రాధాన్యాన్ని వెల్లడించనున్న నిర్మలా సీతారామన్
- ఈ నెల 23న వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి కొత్త రికార్డును సృష్టించనున్న నిర్మలా సీతారామన్
- గతంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో వరుసగా ఆరుసార్లు ప్రవేశపెట్టారు.



## ఇక నుంచి ఏడాదికి రెండు టెట్

- తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ప్రతి ఏడాది జూన్ నెలలో ఒకసారి, డిసెంబర్ నెలలో మరోసారి టెట్
- అయితే టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికే డీఎస్సీ రాసుకునేందుకు అవకాశం
- టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీ



హైదరాబాద్

టీచర్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇక నుంచి ఏడాదికి రెండు సార్లు టెట్(టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్) నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జూన్ నెలలో ఒకసారి, డిసెంబర్ నెలలో మరోసారి టెట్ నిర్వహించనున్నారు. ఇక ఒక అభ్యర్థి ఎన్నిసార్లైనా టెట్ రాసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికే డీఎస్సీ రాసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వనున్నారు. గతంలోనే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా టెట్ గడువును జీవితకాలానికి పెంచింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఒక్కసారి క్వాలిఫై అయితే, మరోసారి రాయాల్సిన అవసరం లేదు. టెట్ మార్కులకు డీఎస్సీలో వెయిటేజీ ఉండటంతో కేవలం ఇప్పటికే టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్కోర్ పెంచుకునేందుకు మాత్రమే రాసుకోవచ్చు.





## త్రిపుర విద్యాసంస్థల్లో హెచ్‌ఐవీ కలకలం

- 47 మంది విద్యార్థులు మృతి
- సుమారు 828 మంది విద్యార్థులకు హెచ్‌ఐవీ పాజిటివ్
- ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నాయని వెల్లడి
- రాష్ట్రంలో మొత్తంగా హెచ్‌ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674గా ఉంది

## సమస్యల పరిష్కారం కోసం రెండు కమిటీలు



- అధికారులతో ఓ కమిటీ, మంత్రులతో మరో కమిటీ వేయాలని నిర్ణయం
- సమస్యల పరిష్కారం కోసం కీలక నిర్ణయం!
- 1.45 గంటల పాటు సాగిన ముఖ్యమంత్రుల సమావేశం
- హైదరాబాద్ లోని స్థిరాస్తులు ఇవ్వడానికి తెలంగాణ నో.. ఢిల్లీలోని ఏపీ భవన్ తరహా నిర్మాణానికి స్థలం ఇస్తామన్న రేవంత్!
- హైదరాబాద్‌లో భూమి కోసం అర్జీ పెట్టుకోవాలని ఏపీకి సూచించిన తెలంగాణ
- ఐదు గ్రామాలను ఇవ్వాలని కోరిన తెలంగాణ... ఏపీ సానుకూల స్పందన?
- విద్యుత్ బకాయిలపై ఇరు రాష్ట్రాల చర్చ

హైదరాబాద్

తెలంగాణ, హైదరాబాద్‌లోని కొన్ని భవనాలను తమకు ఇవ్వాలన్న ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తిని తెలంగాణ తోసిపుచ్చినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లోని స్థిరాస్తులను ఏపీకి ఇచ్చేది లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారని అంటున్నారు. అవసరమైతే ఢిల్లీలోని ఏపీ భవన్ తరహాలో హైదరాబాద్‌లో భవనం కట్టుకోవడానికి అనుమతి ఇస్తామని చెప్పారు. భూమి కోసం ఏపీ అర్జీ పెట్టుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. ఇరు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం కోసం రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులతో ఒక కమిటీని, అధికారులతో మరో కమిటీని వేయాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల మధ్య సామరస్యపూర్వకంగా చర్చ సాగింది. ఇరు రాష్ట్రాల - మిగతా 3లో


## మిషన్ 80గా కాంగ్రెస్ అడుగులు

- మరో 9 మంది కోసం గేట్లు ఓపెన్
- త్వరగా టార్గెట్ ఫినిష్ చేయాలని హస్తం నేతలు కసరత్తు
- అసెంబ్లీ సమావేశాల ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య కనీసం 80కి చేరాలని డిసైడ్
- ఇక ఈ రెండు మూడు రోజుల్లోనే మరిన్ని చేరికలు



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. 80 టార్గెట్ గా పెట్టుకుని వీలైనంత త్వరగా టార్గెట్ ఫినిష్ చేయాలని హస్తం నేతలు కసరత్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య కనీసం 80కి చేరాలని డిసైడ్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందగా, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్యా బలం 65 కి పెరిగింది. ఇక బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు విడతల వారీగా కాంగ్రెస్ గూటికి చేరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. - మిగతా 3లో



### బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్

- ఈ నెల 23న కేంద్ర బడ్జెట్
- ఈ నెల 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు సమావేశాలు
- ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

## నియోజకవర్గానికో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కతో కలిసి సచివాలయంలో బడ్జెట్ సమీక్ష సమావేశం
- పోటీ పరీక్షల కోచింగ్‌కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ
- నాలుగు నెలల్లో ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలు
- గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి

హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లోని యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రతినియోజక వర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి మల్లు విక్రమార్క అన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కతో కలిసి సచివాలయంలో బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంఆ ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల కోచింగ్‌కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. - మిగతా 3లో





## కాంగ్రెస్ పార్టీలోకి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు జంప్..!

- మంత్రి డి.శ్రీధర్ బాబుతో భేటీ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలపై కారు పార్టీ అగ్రనేతలు విమర్శలు
- తాజాగా పార్టీ మారుతున్న నేతలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్

హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 10 మంది ఎమ్మెల్యేలు కారు పార్టీకి రాజీనామా చేసిన హస్తం గుటికి చేరారు. అలాగే బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగుగు ఎమ్మెల్సీలు సైతం గులాబీ గూటిని వీడి హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. అయితే శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి - మిగతా 3లో

# నిర్మలా సీతారామన్ రికార్డు!

త్వరలో బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు బడ్జెట్ సెషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22న మొదలై.. ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. ఆర్థిక మంత్రి సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మూడో ప్రభుత్వ ప్రాధాన్యాన్ని వెల్లడించనున్నారు. నిర్మలా సీతారామన్ చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించారు.



ఈ నెల 23న వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి కొత్త రికార్డును సృష్టించనున్నారు. గతంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో వరుసగా ఆరుసార్లు ప్రవేశపెట్టారు. నిర్మలా సీతారామన్ మోదీ ప్రభుత్వంలో వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. మోదీ ప్రభుత్వంలో వరుసగా మూడోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రికార్డును నెలకొల్పారు. ఆమె రాజకీయ జీవితంలో ఎన్నో మైలురాళ్లను సాధించారు. 2017లో తొలి మహిళా రక్షణ మంత్రిగా పని చేశారు. అంతకు ముందు ఆమె పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రిగానూ సేవలందించారు. అరుణ్ జైట్లీ (ఆర్థిక మంత్రి 2014-19) అస్వస్థతకు గురైన సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత సీతారామన్ ఆర్థిక శాఖ బాధ్యతలు చేపట్టారు. స్వతంత్ర భారతదేశంలో పూర్తికాలం మహిళా ఆర్థిక మంత్రిగా కొనసాగారు.

అంతకుముందు, ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కొద్దికాలం పాటు ఆర్థిక మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. సీతారామన్ 1959 ఆగస్టు 18న మధురైలో రైల్వేలో పనిచేసిన నారాయణ్ సీతారామన్-సావిత్రి దంపతులకు జన్మించారు. సీతారామన్ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ అండ్ ఎంఫిల్ చేశారు. 1986లో పరకాల ప్రభాకర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ స్టడీస్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. 2003 నుంచి 2005 వరకు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా సేవలందించారు.

# అయోధ్యలో ఓడించాం, ఇక గుజరాత్ వంతు..

**అహ్మదాబాద్:** అయోధ్యలో బీజేపీని ఓడించినట్టే గుజరాత్‌లోనూ బీజేపీని, నరేంద్ర మోదీని కలిసికట్టుగా ఓడిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రామమందిరం ఆధారంగా బీజేపీ చేపట్టిన ఉద్యమాన్ని అయోధ్యలో ఇండియా కూటమి ఓడించిందని అహ్మదాబాద్‌లో శనివారంనాడుడు ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తలతో సమావేశంలో చెప్పారు. "రామమందిరం ఆధారంగా చేసుకుని బీజేపీ ఉద్యమం చేసింది. దీనిని ఎల్‌కే అద్వాణీ ప్రారంభించారు. ఆయన రథయాత్ర చేపట్టినప్పుడు మోదీ ఆయనకు సహకారం అందించారు. కానీ వారు (బీజేపీ) రామందిరాన్ని ప్రారంభించినప్పుడు అక్కడ అదానీ, అంబానీలే తప్ప ఒక్క పేదవాడు కూడా కనిపించలేదు" అని రాహుల్ అన్నారు. అయోధ్యలో ఓడించినట్టే గుజరాత్‌లోనూ బీజేపీని, నరేంద్రమోదీని ఓడించనున్నామని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం పేరుతో పేదల భూములను లాక్కున్నారని, రామాలయ ప్రారంభోత్సవానికి అయోధ్య నుంచి ఒక్కరిని కూడా ఆహ్వానించకపోవడంతో వారు మనస్తాపానికి గురయ్యారని చెప్పారు. అద్వాణీ ఉద్యమానికి



కేంద్ర స్థానమైన అయోధ్యలోనే వారిని ఇండియా కూటమి ఓడించిందన్నారు. తొలుత అయోధ్య నుంచి పోటీ చేయాలని ప్రధానమంత్రి మోదీ అనుకున్నారని, అయితే సర్వేలన్నీ ఆయన ఓడిపోతారని, రాజకీయ కెరీర్ ముగిసిపోతుందని చెప్పాయని వివరించారు. తనకు దేవుడితోనే డైరెక్ట్ కనెక్షన్ ఉందని మోదీ చెబుతున్నారని, అలాంటప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య నుంచి బీజేపీ ఎందుకు ఓడిపోయిందని రాహుల్ ప్రశ్నించారు. కాగా, రాహుల్ గుజరాత్ పర్యటనలో భాగంగా ఇటీవల రాజ్‌కోట్ జోన్ అగ్నిప్రమాదం, వడోదరలో పడవ మునక, మోర్బీ వంతెన కుప్పకూలిన ఘటనల్లో మృతుల కుటుంబాలను పరామర్శించనున్నారు.

కాగా, రాహుల్ గాంధీ లోక్‌సభలో హిందుత్వపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ యువజన విభాగం సభ్యులు జులై 2న అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద విధ్వంసం సృష్టించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. 'మమ్మల్ని బెదిరించి, మా కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా వాళ్లు (బీజేపీ) సవాల్ విసిరారు. మా కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్లుగా మేమంతా కలిసి వారి ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయబోతున్నాం. రాత పూర్వకంగా తీసుకోండి. అయోధ్యలో చేసినట్లే గుజరాత్‌లోనూ నరేంద్ర మోదీని, బీజేపీని ఓడిస్తాం' అని అన్నారు. గుజరాత్ నుంచే కొత్త ప్రారంభాన్ని కాంగ్రెస్ ప్రారంభిస్తుందని తెలిపారు.

# బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్

కేంద్రంలో ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక మొదటిసారిగా పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు నిర్వహించనున్నారు. జులై 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. 18వ లోక్‌సభ కొలువుదీరిన విషయం తెలిసిందే. జూన్ 24వ తేదీన 18వ లోక్‌సభ మొదటి సెషన్ ప్రారంభం కాగా.. జూన్ 26న ఓం బిర్లా వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఇక తొలి సమావేశాలు ముగియడంతో ఇప్పుడు కేంద్రం బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈనెల 22వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు శనివారం ప్రకటించారు. ఆగస్టు 12 వరకూ ఈ సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను జులై 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం




అప్పట్లో తెలిపింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ తాజాగా ఆర్బీఐ గవర్నర్ తో సమావేశమయ్యారు. బడ్జెట్ కేటాయింపుల అంశంపై చర్చించారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది ఏడోసారి. ఈసారి ఏపీలో ఎన్డీయే కూటమి పార్టీలు అధికారంలో ఉండడంతో, రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తి కలిగిస్తోంది.

## ఎంపీ తప్పుడు స్టేట్‌మెంట్‌తోనే నా భర్త అరెస్టు..

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఆయన భార్య సునీత కేజ్రీవాల్ కీలక విషయాలు వెల్లడించారు. ఇందుకు బంధించిన వీడియోను ఆమె శనివారంనాడు విడుదల చేశారు. ఎన్డీయే ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తప్పుడు వాంగ్మూలం ఆధారంగానే లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిందని ఆ వీడియోలో ఆమె ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2022 సెప్టెంబర్ 22న ఎంఎస్ఆర్ నివాసంపై దాడి జరిపిందని, ఆసమయంలో కేజ్రీవాల్‌ను మీరు కలిసారా అని ఈడీ ప్రశ్నించిదని సునీత తెలిపారు. 2021 మార్చి 16న ఢిల్లీ సెక్రటేరియట్‌లోని సీఎం కార్యాలయంలో కేజ్రీవాల్‌ను తాను కలిసినట్టు ఎంఎస్ఆర్ బదులిచ్చారని చెప్పారు. ఢిల్లీలో ఫ్యామిలీ ఛారిటబుల్ ట్రస్టును ప్రారంభించేందుకు భూమి కోసం కేజ్రీవాల్‌ను ఎంఎస్ఆర్ కలిశారని, అయితే ఆ భూమి ఎల్జీ పరిధిలోకి వస్తుందని, ఆయనను కలిసి అప్లికేషన్ ఇవ్వమని కేజ్రీవాల్ చెప్పడంతో ఆ పని చూసుకుని ఆయన వెళ్లిపోయారని సునిత తెలిపారు. ఎంఎస్ఆర్ చెప్పిన జవాబు నచ్చకపోవడంతో ఆయనపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన కుమారుడు రాఘవ రెడ్డిని ఈడీ అరెస్టు చేసిందన్నారు. రాఘవకు బెయిల్ కూడా రాకుండా చేసిందన్నారు. ఆ సమయంలో రాఘవరెడ్డి భార్య, ఎంఎస్ఆర్ కోడలు ఆత్మహత్యా యత్నం చేయడం, తన కొడుకు పరిస్థితి చూసి ఎంఎస్ఆర్ కంటతడి పెట్టుకోవడం జరిగిందన్నారు. ఆ క్రమంలోనే 2023 జూలై 17న ఎంఎస్ఆర్ తన స్టేట్‌మెంట్‌ను మార్చుకున్నారని తెలిపారు. లిక్కర్ వ్యాపారం చేయమని, ఆప్‌కు రూ.100 కోట్లు ఇవ్వమని పది మంది సమక్షంలో కేజ్రీవాల్ అడిగినట్టు ఎంపీ స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఆ తరువాత రెండ్రోజులకే రాఘవకు బెయిల్ వచ్చిందని సునీత గుర్తు చేశారు. దీనిని బట్టే ఎంపీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని అర్థమవుతోందన్నారు.

# త్రిపుర విద్యాసంస్థల్లో హెచ్ఐవీ కలకలం

త్రిపుర రాష్ట్రంలో హెచ్ఐవీ వైరస్ కలకలం రేపుతోంది. ఈ వ్యాధి కారణంగా 47 మంది విద్యార్థులు మృతి చెందారు సుమారు 828 మంది విద్యార్థులకు హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించినట్లు త్రిపుర స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సీనియర్ అధికారి ఒకరు తాజాగా తెలిపారు. 828 మంది హెచ్ఐవీ పాజిటివ్ విద్యార్థుల్లో 572 మంది బతికే ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ 5 నుంచి 7 కొత్త కేసులు నమోదవుతున్నా యని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తంగా హెచ్ఐవీతో బాధపడుతున్నవారి సంఖ్య 5,674గా ఉందన్నారు. వీరిలో పురుషులు 4,570 మంది కాగా, మహిళలు 1,103 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ కేసుల పెరుగుదలకు మాదకద్రవ్యాల దుర్వినియోగమే కారణమని చెప్పారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 220 పాఠశాలలు, 24 కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు డ్రగ్స్ ఇంజెక్షన్ తీసుకుంటున్న గుర్తించినట్లు చెప్పారు. త్రిపుర జర్నలిస్ట్ యూనియన్, వెబ్ మీడియా ఫోరమ్, టీఎస్ఏసీఎస్ ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌లో టీఎస్ఏసీఎస్ జాయింట్ సెక్రటరీ ప్రసంగిస్తూ.. 'ఇప్పటి వరకు 828 మంది హెచ్ఐవీ పాజిటివ్ విద్యార్థులు నమోదయ్యారు. వారిలో 572 మంది విద్యార్థులు బతికే ఉన్నారు. ఈ ఇన్ఫెక్షన్ కారణంగా 47 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం త్రిపుర వెలుపల ఉన్న ప్రసిద్ధ సంస్థలకు వలస వెళ్ళారు. ఇప్పటి వరకు 220 పాఠశాలలు, 24 కళాశాలలు, యూనివర్సిటీల్లో విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 164 ఆరోగ్య కేంద్రాల నుంచి ఈ డేటాను సేకరించాం' అని వెల్లడించారు.




## మహిళా ప్రిన్సిపాల్ చేత బలవంతంగా సీటు ఖాళీ చేయించిన స్కూల్ యాజమాన్యం

యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఘటన

ఫిబ్రవరి 11న బిషప్ జాన్సన్ బాలికల స్కూల్ పరీక్షా కేంద్రంలో జరిగిన యూపీపీఎస్సీ పరీక్ష పేపర్ లీక్

ఈ స్కామ్‌లో ప్రిన్సిపాల్ పరుల్ సోలమన్‌కు ప్రమేయం ఉందని ఆరోపణలు

దాంతో ఆమెను ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పించిన స్కూల్ యాజమాన్యం

కానీ, పరుల్ మాత్రం తన సీటును ఖాళీ చేసేందుకు ససేమీరా

దాంతో చేసేదేమీలేక ఆమెను బలవంతంగా తొలగించిన వైనం

యూపీలోని ఓ బాలికల పాఠశాల మహిళా ప్రిన్సిపాల్‌ను బలవంతంగా తొలగించి, ఆమె సీటు ఖాళీ చేయించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన యూపీపీఎస్సీ రివ్యూ ఆఫీసర్, అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ పరీక్ష నిర్వహించింది. దీనిలో భాగంగా బిషప్ జాన్సన్ బాలికల పాఠశాలకు కూడా పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. అయితే, ఈ ఎగ్జామ్ సెంటర్‌లో పేపర్ లీక్ అయ్యింది. దాంతో స్కూల్ నిర్వాహకుడు వినీత్ జస్వంత్‌ను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ పేపర్ లీకేజీలో పాఠశాల ప్రిన్సిపాల్ పరుల్ సోలమన్‌కు ప్రమేయం ఉందని ఆరోపణలు వచ్చాయి. దాంతో స్కూల్ యాజమాన్యం ఆమెను ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పించింది. ఆమె స్థానంలో షెర్లిన్ మాస్సేను కొత్త ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజాగా కొత్త ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టేందుకు రాగా.. పరుల్ సోలమన్ మాత్రం తన సీటును ఖాళీ చేసేందుకు ససేమీరా అన్నారు. దాంతో ఆ సంస్థ ఛైర్మన్ బిషప్ మారిస్ ఎడ్గార్ డాన్ నేతృత్వంలో స్కూల్ సిబ్బంది ప్రిన్సిపాల్ ఆఫీస్‌లోకి వచ్చి ఆమెను సీటు ఖాళీ చేయాల్సిందిగా కోరారు. కానీ, ఆమె నిరాకరించారు. దాంతో చేసేదేమీలేక ఆమె చేతిలోని మొబైల్ ఫోన్ లాక్కున్నారు. అనంతరం పరుల్ కూర్చొన్న ఛైర్‌ను ముందుకు లాగి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ తర్వాత కొత్త ప్రిన్సిపాల్ షెర్లిన్ మాస్సేను ఆ సీటులో కూర్చోబెట్టి అక్కడున్న సిబ్బంది ఆమెను అభినందించారు. ఇక ప్రిన్సిపాల్ సీటును బలవంతంగా ఖాళీ చేయించడంపై పరుల్ సోలమన్ పోలీసులను ఆశ్రయించారు. తనను లైంగికంగా వేధించారని ఆమె ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్.. సీఆర్పీఎఫ్ జవాన్ వీరమరణం..



కుల్గామ్ జిల్లా మోడెర్గాంలో భద్రతా బలగాలు, ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో కాల్పులు జరుగుతున్నాయని కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు గాయపడ్డాడు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసు, ఆర్మీ9 ఆర్ఆర్, సీఆర్పీఎఫ్ సంయుక్త బృందం ఈ ప్రాంతంలో తీవ్రవాదుల ఉనికి గురించి నిర్దిష్ట సమాచారం ఆధారంగా కార్డన్, సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు అధికారి తెలిపారు. సైనికుల ఉమ్మడి బృందాలు అనుమానాస్పద స్థలం వైపు వెళ్లగానే దాక్కున్న ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారని, దాంతో ప్రతీకారంగా ఎన్‌కౌంటర్‌కు దారితీసిందని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులు దాక్కొని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అమర్‌నాథ్ ప్రారంభమైన తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఇది మొదటి ఎన్‌కౌంటర్ కావడం గమనార్హం.

## బ్రిటన్ నూతన ప్రధాని కీర్ స్టార్మర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

బ్రిటన్ ఎన్నికల్లో కీర్ స్టార్మర్ నాయకత్వంలోని లేబర్ పార్టీ 412 స్థానాలతో ఘనవిజయం సాధించడం తెలిసిందే. రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలకే పరిమితమైంది. ప్రధాని పదవికి రిషి సునాక్ రాజీనామా చేయగా... బ్రిటన్ నూతన ప్రధానిగా కీర్ స్టార్మర్ పగ్గాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. బ్రిటన్ నూతన ప్రధాని కాబోతున్న కీర్ స్టార్మర్ తో మాట్లాడడం ఎంతో సంతోషం కలిగించిందని వెల్లడించారు. ప్రధానమంత్రి పీఠం ఎక్కుతున్న కీర్ స్టార్మర్ కు శు భాకాంక్షలు తెలిపానని వివరించారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇరుదేశాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ప్రపంచ హితం దిశగా దృఢమైన ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉంటామని మోదీ ట్వీట్ చేశారు.



## కేసులో ప్రధాన ముద్దాయిని అరెస్ట్ చేశాం హత్రాస్ జిల్లా ఎస్పీ

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై విచారణ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న దేవ్ ప్రకాశ్ మధుకర్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో హత్రాస్ జిల్లా ఎస్పీ నిపుణ్ అగర్వాల్ శనివారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. 'కేసులో ప్రధాన నిందితుడైన దేవ్ ప్రకాశ్ మధుకర్‌ను అదుపులోకి తీసుకున్నాం. అంతకుముందు అతనిపై లక్ష రూపాయల రివార్డు ప్రకటించాం. ఢిల్లీలోని నజఫ్‌గఢ్‌లో నిందితుడు పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి హత్రాస్‌కు తీసుకొచ్చాం. కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నది. సత్సంగ్ కార్యక్రమానికి విరాళాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నాం. కేసును ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్టుమెంట్ దృష్టికి కూడా తీసుకెళ్తాం. విరాళాల సేకరణలో అవకతవకలుంటే వాళ్లు వదిలిపెట్టరు' అని ఎస్పీ నిపుణ్ అగర్వాల్ చెప్పారు. కేసుకు సంబంధించి ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ప్రధాన నిందితుడు దేవ్ ప్రకాశ్ మధుకర్.. నారాయణ్ సకార్ హరి అలియాస్ భోలే బాబాకు ప్రధాన సహాయకుడు. తొక్కిసలాటకు కారణమైన సత్సంగ్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసింది మధుకరే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా హత్రాస్ తొక్కిసలాటలో మొత్తం 121 మంది ప్రాణాలు కోల్పోయారు.



# బూటకపు హామీలుగా ఎన్నికల హామీలు..

**అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం : ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



**హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ బూటకపు హామీలుగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో చెప్పించిన హామీలు అన్నీ బూటకపు హామీలుగా మార్చారు. ఎన్నికల మేనిఫెస్టోను డమ్మీ పేపర్‌గా తయారు చేశారని విమర్శించారు. లోకల్ బాడీ ఎన్నికలు పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ భయపడుతోంది. లోకల్ బాడీ ఎన్నికలు జరగకుంటే కేంద్ర నుంచి వచ్చే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీలో శానిటేషన్ కార్మికులకు ఇచ్చే వేతనాలు కూడా ఇవ్వడం లేదు. మంత్రులు గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే పరిస్థితి అర్థం అవుతుంది. సర్పంచ్ లు లేరు%ొ% ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం పూర్తయ్యింది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారితే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్ తీసుకుంటున్నారు. వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తున్నారు. కానీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు మాత్రం ఇవ్వడం లేదు. రూ. 1200 కోట్ల సర్పంచ్‌ల నిధులను కక్ష సాధింపులో భాగంగా ఆపేశారు. మధ్యాహ్న భోజన పథకం వడ్డించే వారికి 7 నెలలుగా బిల్లులు చెల్లించలేదు. కేవలం పెద్ద కాంట్రాక్టర్లకు నచ్చిన వాళ్లకే బిల్లులు ఇస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏప్రిల్ నెల పింఛన్లు జూన్ 25న ఇచ్చారు.. మరి మే, జూన్ పెన్షన్లు ఎప్పుడు ఇస్తారు..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. నిధులు లేక పంచాయతీలు విలవిలలాడుతున్నాయి. హైదరాబాద్‌లో ఉంటూ ప్రజా పాలన అంటే ఎలా..? పల్లెల్లో పర్యటిస్తూ ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలి. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేస్తుంది. గ్రామాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే%ొ% పంచాయతీ, లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలి. పల్లె ప్రగతికి రావల్సిన నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మిషన్ 80గా కాంగ్రెస్ అడుగులు

-మొదటిపేజీ తరువాయి

దీంతో కాంగ్రెస్ సంఖ్యా బలం 71 కి చేరింది. ఇక ఈ రెండు మూడు రోజుల్లోనే మరిన్ని చేరికలు ఉంటాయని హస్తం నేతలు చెబుతున్నారు. ఆషాడం మొదలవక ముందే కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నట్లు, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చర్చలు పూర్తయ్యాయట. రెండు మూడు రోజుల్లోనే వారు తమ గూటికి వస్తారని హస్తం నేతలు చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఒకరు కాంగ్రెస్‌లో చేరేందుకు ఒకే చెప్పినట్లు సమాచారం. ఇక మాజీ సీఎం కేసీఆర్ స్వంత జిల్లా మెదక్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఉన్నారట. కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గులాబీ పార్టీలోని చాలామంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి రావడంతో ఏకంగా బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. మొన్నటి వరకు ఎవరిని చేర్చుకుంటే ఏం అవుతుందో అని భయపడ్డ రేవంత్, హై కమాండ్ గ్రీన్ సిగ్నల్‌తో తన దూకుడు పెంచారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బీజేపీ గాలం వేస్తోందని అప్రమత్తంగా ఉండకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నారట. రాష్ట్ర పరిస్థితులను రేవంత్ మొన్న ఢిల్లీ పెద్దలకు తెలిపినట్టు సమాచారం. ఏదేమైనా అనుకున్న టార్గెట్ రీచ్ కావాలని, ఎవరు అడ్డు చెప్పినా తాము చూసుకుంటామని హై కమాండ్ చెప్పడంతో రేవంత్ తన బాధ్యతను కంప్లీట్ చేసే పనిపై పూర్తి దృష్టి పెట్టారు. లోకల్ బాడీ ఎన్నికల కోసం పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రభుత్వ సుస్థిరతను కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలను ఢిల్లీ టూర్ లో రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి తెలియచేశారట. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోసం కాంగ్రెస్ గేట్లు తెరిచామని ప్రకటించిన హస్తం నేతలు చేరికలకు కొద్ది రోజులు విరామం ప్రకటించారు. ఇక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో తమతో కలిసి వస్తామని గతంలో చెప్పిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో టచ్ లోకి వెళ్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా సాధించకపోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ భవిష్యత్తు కోసం నిర్ణయం తీసుకునే ఆలోచనలో పడ్డట్టు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తెచ్చేందుకు బీజేపీ సైతం ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీంతో ఎమ్మెల్యేలను బీజేపీలోకి వెళ్లకుండా కట్టడి చేయడం, తమతో కలుపుకుపోవడం వెంటనే జరగాలని హస్తం నేతలు భావిస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలపై కూడా కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. మెజారిటీ ఎమ్మెల్సీలు తమకు నెక్స్ట్ టర్మ్ రెన్యూవల్ చేస్తే చేరేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం. అయితే పార్టీ పాలసీ ప్రకారం ముందే హామీ ఇవ్వలేమని పార్టీలో చేరితే మాత్రం సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యనేతలు హామీ ఇస్తున్నారట. దీంతో రాత్రికి రాత్రే ఆరుగురు ఓఒఅలు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. ఇంకో 9 మంది ఓఒఅ లను పార్టీలోకి ఆకర్షించి 2/3 మెజార్టీ కంప్లీట్ చేస్తే, ఃఖీూ విలీనం చేసుకునే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఎమ్మెల్సీలను కూడా కాంగ్రెస్ గూటికి చేర్చుకొని పెద్దల సభను కూడా తమ ఆధీనంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకొచ్చే కీలక బిల్లులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే మండలిలో కూడా మెజారిటీ సాధించాలని పార్టీ నిర్ణయం తీసుకొని ఎమ్మెల్సీలతో మాట్లాడే బాధ్యతను పలువురు మంత్రులకు అప్పచెప్పినట్టు సమాచారం.



# సమస్యల పరిష్కారం కోసం రెండు కమిటీలు

-మొదటిపేజీ తరువాయి

ప్రయోజనాలకు భంగం కలగకుండా పరిష్కారాలు ఉండాలని నిర్ణయించారు.

ఈ రోజు సాయంకాలం హైదరాబాదులోని ప్రజాభవన్ లో జరిగిన చంద్రబాబు, రేవంత్ రెడ్డిల సమావేశం ముగిసింది. అయితే సమావేశంలో తెలంగాణ పలు డిమాండ్లను ఏపీ ముందు ఉంచినట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. తమకు రూ.24 వేల కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఏపీ కోరగా... తెలంగాణ నిరాకరించిందని అంటున్నారు. అలాగే, హైదరాబాద్‌లోని ఆస్తులను ఇచ్చేందుకు నిరాకరించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు గ్రామాలు... ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నంలను తమకు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ విజ్ఞప్తికి చంద్రబాబు నుంచి సానుకూల స్పందన వచ్చినట్లుగా తెలుస్తోంది.

భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాల్లో గల 5 గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని చంద్రబాబును రేవంత్ రెడ్డి అడిగారని తెలిసింది. ఎటపాక, గుండాల, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు పంచాయతీలను విలీనం చేయాలని కోరినట్టు సమాచారం. ఇదే అంశంపై కేంద్ర హోం శాఖకు లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిసింది. హైదరాబాద్‌లో కొన్ని భవనాలు తమకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. అందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తిరస్కరించారని వార్తలు వస్తున్నాయి.



ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూల్ 9, 10లో పేర్కొన్న ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో పేర్కొనని సంస్థల పంపకాలు, ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్ బిల్లులు, విదేశీ రుణ సాయంతో ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి ఏపీలో పదిహేను ప్రాజెక్టులు నిర్మించగా... ఇందుకు సంబంధించిన అప్పులపై, ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చులు, చెల్లింపులపై చర్చించారని సమాచారం. ఉద్యోగుల విభజన అంశాలపై కూడా చర్చించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారు?: బండి సంజయ్ ప్రశ్న

**పార్టీ ఫిరాయింపులను చేపట్టవద్దని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిందని విమర్శ**

**కేకేతో రాజీనామా చేయించిన కాంగ్రెస్...**

**ఎమ్మెల్యేలతో ఎందుకు చేయించడం లేదని నిలదీత**

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కి పెద్ద తేడా లేదని మండిపాటు**

పార్టీ ఫిరాయింపులను చేపట్టవద్దని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిందని... అలాంటప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తమ పార్టీలో చేరిన కే కేశవరావుతో రాజీనామా కాంగ్రెస్ పార్టీ రాజీనామా చేయించిందని గుర్తు చేశారు. మరి బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఎందుకు రాజీనామా చేయించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహారంపై ప్రజలు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కి పెద్దగా తేడా లేదని విమర్శించారు.

## నియోజకవర్గానికో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్



-మొదటిపేజీ తరువాయి

నాలుగు నెలల్లో ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులుపడుతున్నారని. వారిని అలాగే వదిలేస్తే సమాజం ఇబ్బందిపడుతుందన్నారు. ఫీజు రీయింబ్స్‌మెంట్ పథకం అందుబాటులోకి రావడంతో వేలాది మంది బీటెక్ పూర్తి చేసి.. స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారని.. ఆర్థికంగా ఉన్నవారు, తోడ్పాటు అందిన వారు విదేశాల్లో స్థిరపడుతున్నారన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా మొదట పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు.. వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారో వివరాలు సేకరించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అనుసంధానం చేసుకొని ఉపాధి కల్పించే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మిషన్ మిషన్ భగీరథ పథకం పనితీరుపై ఈ నెల 15 వరకు నివేదిక ఇవ్వాలని కోరారు. నివేదికను అందరు ఎమ్మెల్యేలకు అందజేసి ఇంటింటికి నీరు అందుతుందా? అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే అంశం గ్రామసభల్లో ఓ ఎజెండాగా చేర్చాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి హరిత, పంచాయతీరాజ్ శాఖ అధికారులు దివ్య దేవరాజన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు జంప్..!



-మొదటిపేజీ తరువాయి

డి.శ్రీధర్ బాబుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ఏ గాంధీ, వివేక్, లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు భేటీ అయ్యారు. దాంతో వారు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారనే ఓ ప్రచారం అయితే ఊపందుకొంది. అయితే తమ తమ నియోజకవర్గాల్లోని పెండింగ్ పనులు పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు కోరేందుకు తామంతా ఇలా వచ్చామని చెబుతున్నారు. మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి.. బీఆర్ఎస్ పార్టీకి ఈ రోజు రాజీనామా చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు దీపా దాస్ మున్షీ సమక్షంలో బండ్ల కృష్ణమోహన్ ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలపై కారు పార్టీ అగ్రనేతలు మండిపడుతున్నారు. ఆ క్రమంలో వారిపై విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి.. తాజాగా పార్టీ మారుతున్న నేతలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరేందుకు బీఆర్ఎస్ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ నేతలు.. కోర్టులను ఆశ్రయించేందుకు సన్నాహాకాలు చేస్తున్నారు. అదీకాక గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా చోటు చేసుకున్న పరిణామాలను ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం గుర్తు చేస్తుంది. అలా బీఆర్ఎస్ అగ్రనేతల విమర్శలను హస్తం పార్టీ నేతలు తిప్పికొడుతున్నారు.

# అసంతృప్తితో కొండా సురేఖ

**వరంగల్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీలో చేరిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మరో వికెట్ పడింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. రెండు నెలలుగా సారయ్య పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. చివరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సారయ్య చేరిక తో వరంగల్ లో రాజకీయ అలజడి మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ నాయకుడిగా, మాజీ మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన సారయ్య 1999 నుండి 2009 వరకు వరుసగా మూడుసార్లు గెలిచారు. 2009 నుండి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా చేశారు. 2014 ఎన్నికల్లో బీ అర్ ఎస్ అభ్యర్థి కొండా సురేఖ చేతిలో ఓడిపోయారు. అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా 2016 లో బీ అర్ ఎస్ లో చేరారు. 2018 ఎన్నికల్లో టిక్కెట్ వస్తుందనుకున్నాను. సిట్టింగ్ ఎమ్మెల్యే కొండా సురేఖ, సారయ్య ను కాదని అప్పటి మేయర్ నరేందర్ కు వరంగల్ తూర్పు టిక్కెట్ ఇచ్చారు. దీంతో సురేఖ తిరిగి కాంగ్రెస్ లోకి వెళ్ళగా. సారయ్య కు 2020 లో కే సీ ఆర్ గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సారయ్య స్వంత గూటికి చేరుకున్నారు. సారయ్య కాంగ్రెస్ లో చేరికతో రాజకీయ అలజడి మొదలైంది. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా గెలిచిన కొండా సురేఖ మంత్రిగా ఉన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా బీ అర్ ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి నేతలు క్యూ కడుతున్నారు. మంత్రి సురేఖ చేరిక ల పై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. సొంత నియోజకవర్గ వరంగల్ తూర్పు తో పాటు కొండ సురేఖ పాత నియోజకవర్గం పరకాలలో తనకు తెలియకుండా ఎలా పార్టీలో కి చేర్చుకుంటారని గుర్రుగా ఉన్నారు. ఇదే సమయంలో సారయ్య కాంగ్రెస్ లో చేరడంతో కొండా సురేఖ అంతర్మానంలో పడింది. ఇప్పటికే సురేఖ కొత్తగా వచ్చిన నేతలను కలుపుకొని పోకపోవడం, దూరంగా పెట్టడంతో రాజకీయ దుమారం కొనసాగుతుంది. కొండా సురేఖ తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం వసంతృప్తి తో ఉన్నారట. ఇదే సమయంలో బసవరాజ్ సారయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తూర్పు నియోజకవర్గంలో రాజకీయ అలజడి మొదలైందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి సైతం అనేకసార్లు కొండ దంపతులను మందలించినట్టు సమాచారం. సారయ్య ను సైతం కొండా సురేఖకు తెలియకుండానే పార్టీలోకి తీసుకువచ్చారనే ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర పర్యటన రోజే సారయ్య చేరిక ఖరారైంది. ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి సారయ్య తో మంతనాలు జరిపారు. బస్వరాజు సారయ్య వరంగల్ తూర్పు నియోజకవర్గం తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంచి పట్టున్న నాయకుడు. హంగు ఆర్భాటాలని లేని నాయకుడిగా నిత్యం ప్రజల్లో ఉండే నేతగా సారయ్య కు మంచి గుర్తింపు ఉంది.

# ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** ప్రజా ప్రతినిధులు లేకపోతే ప్రజల సమస్యలు తెలుసుకోలేమని జెడ్పిటిసి,ఎంపిటిసిల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎంపీడీవో హైమద్ అన్నారు. శనివారం మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసిన జెడ్పిటిసి, ఎంపిటిసిలకు కో ఆప్షన్ మెంబర్ కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ.. జెడ్పిటిసి, ఎంపిటిసి లు తమ పదవికి మాత్రమే విరమణ కానీ ప్రజాసేవకు కాదు అని అన్నారు. రాబోయే ఎన్నికలలో పోటీ చేసి గెలిచి మళ్లీ ప్రజా సమస్యలను తీర్చాలన్నారు. జడ్పిటిసి పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ.. ఈ ఐదు సంవత్సరాల కాలంలో సమావేశాలలో ప్రజా సమస్యల కోసమే అధికారులతో పోరాటం చేసేంతప్ప వ్యక్తిగతంగా కాదు అని అన్నారు. మండల ప్రజల సహకారం, అధికారుల సహకారంతో మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో ప్రజాసేవ చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఎంపిపి, ఎంపిటిసిలు, తను గాని ప్రజా పోరాటం కోసం అధికారుల మనసును నోప్పించి ఉంటే క్షమించగలరు అన్నారు. అనంతరం మండలాధికారులు



జడ్పిటిసి ఎంపిపి, ఎంపిటిసిలకు, కో ఆప్షన్ మెంబర్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్ఞానుముండే, వైస్ ఎంపీపీ భరత్, మండల ప్రత్యేక అధికారిని సునీత, అధికారులు డిటి భాగ్యలక్ష్మి, ఎంఈఓ, నారాయణ, మండల వైద్యాధికారి శ్యాంసుందర్, ఏపీఓ శ్యాముల్, పిఎస్సిఎస్ చైర్మన్ సంజు ముండే, కో ఆప్షన్ మెంబర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఎస్సిఎస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** పిఎస్సిఎస్ చైర్మన్, బిఆర్ఎస్ మండల నాయకులు సంజు ముండే తన పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని సరస్వతి శిశు విద్యా మందిర్ పాఠశాలకు ఆర్ఓ ప్యూరిఫైడ్ వాటర్ మిషను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవలో భాగంగా వర్షాకాలం కావున విద్యార్థులు అపరిశుభ్రమైన నీరు తాగి సీజనల్ వ్యాధులకు గురికాకుండా వారికి మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్ఓ ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి తన పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞాను ముండే, అంకతి రవీందర్, షేక్ జమీర్, శగీర్ ఖాన్, కేంద్రే మాధవ్, సలీం ఖాన్, గౌస్, తెలంగే మాధవ్, కళ్లేపల్లి ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూజీ జగ్జీవన్ రామ్ వర్ధంతి





**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జిగ్జీవన్ విగ్రహానికి పూలమాలవేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వాతంత్రం కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, అనుగారిన వర్గాల సంక్షేమం కోసం కృషిచేసిన గొప్ప వ్యక్తి బాబు జగ్గీవన్ రామ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నెల లక్ష్మన్, కొల్లూరి సంతోష్, మచ్చ నాగేష్, దుబాక అశోక, కృష్ణ పెల్లి శ్యామ్, మచ్చ వెంకటేష్, కొత్తూరి లక్ష్మణ్, దుబాక చందు, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..**

మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 38 వర్ధంతి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిట్టి రవి మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ మాదిగ మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని ఆంగ్లేయులతో పోరాటం చేసిన గొప్ప ధీరుడు బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్ మాదిగ, సిరిసిల్ల భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జన్నారపు సాయి మాదిగ, పట్టణ అధ్యక్షులు దుబ్బాక చందు మాదిగ, ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా నోట్ బుక్స్ పంపిణీ



**వాస్తవ నేస్తం,జుక్కల్:** ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు జన్మదిన సందర్భంగా నియోజకవర్గంలోని దోతీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాయకులు శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో నోట్ బుక్కులు, పెన్లు, పెన్సిల్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలో తోట లక్ష్మీకాంతరావు హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ధోతి గ్రామ సర్పంచ్ కాశీనాథ్ పటేల్, డీ కాశీనాథ్ పటేల్, మారుతి, నాందేవ్, దశరథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్షల విలువ గల గుట్కాలు స్వాధీనం

**సిద్ధిపేట :** ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు, విలువ 1,46,130 రూపాయలు పట్టుకున్న సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ మరియు సిద్ధిపేట టూ టౌన్ పోలీసులు. ద్దిపేట పట్టణం టీ. మురళీకృష్ణ, హోల్ సేల్ కిరాణా షాప్ యజమాని తెరల సాయి కృష్ణ నివాసం సిద్ధిపేట పట్టణం. అతను ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కాటన్ డబ్బాలతో హోల్ సేల్ గా అమ్ముతున్నాడని అమ్మదగిన సమాచారంపై సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది సిద్ధిపేట టూ టౌన్ పోలీసులు కలసి వెళ్లి షాపులో తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కాటన్ బాక్సులలో ప్యాక్ చేసి ఉన్నవి మొత్తం గుట్కా ప్యాకెట్ల విలువ 1,46,130 గలవిపట్టుకున్నారు.సిద్ధిపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో, పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుపై అసత్య ఆరోపణలు చేసే ప్రజలు ఊరుకోరు

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు.**

**కమాన్ పూర్ :** రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే ప్రజలు ఊరుకోరని దల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, ప్యాక్స్ ఛైర్మెన్ ఇనగంటి భాస్కర్ రావు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజి ఎంపీపీ మల్యాల రానీచందర్ గౌడ్ హెచ్చరించారు.ఈ మేరకు శనివారం కమాన్ పూర్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు ని విమర్శించే హక్కు పుట్ట మధుకు లేదనిమంత్రి శ్రీధర్ బాబు పై అసత్యపు ఆరోపణలు చేస్తే ఉరుకునేది లేదు అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే హక్కు మాజీ జడ్పి చైర్మన్ పుట్ట మధుకు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.ఇటీవల కూలిన ఓడేడు బిడ్జీ గార్డెర్లు పై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలపై వారు ఘాటుగా స్పందించారు. మంత్రి శ్రీధర్ బాబుపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన బ్రిడ్జిని మళ్లీ మంత్రి శ్రీధర్ బాబు పై రుద్దడం సాధికాదని వారన్నారు. ఇటువంటి చౌకబారు ప్రకటనలు చేస్తే సరికాదని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల సింగిల్ విండో అధ్యక్షులు ఇనగంటి భాస్కర్ రావు మాజీ మండల పరిషత్ అధ్యక్షులు మల్యాల రామచంద్రన్ గౌడ్ మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చొప్పరి శేఖర్ మండల



కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాద్రపు శంకర్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిగురు మొండయ్య మండల కాంగ్రెస్ కార్యదర్శి కుశన రవి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్సర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుక్క రవి కమాన్ పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొంతం శ్రీనివాస్ జూలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు భూస తిరుపతి రొంపుకుంట గ్రామ శాఖ అధ్యక్షుడు కోల నరేందర్ పెంచికల్పేట్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరువురాల శేఖర్ గుండారం గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్ సిద్దిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం శీను నాగారం గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి రాజయ్యమాజీ సర్పంచ్ కటకం రవీందర్ తొగరి అశోక్ పిడుగు నరసయ్య కమ్మ గోని మల్లయ్య ఆడవాళ్ళ చంద్రయ్య బీసీ సెల్ జిల్లా సెక్రెటరీ బుర్ర సత్యం సింగిల్ విండో డైరెక్టర్ గుండెటి శ్రీ మూర్తి మారైన ముత్యాలు యాదవ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ సతీష్ మాతంగి సదానందం కోలా తిరుపతి గౌడ్ కటికి రెడ్డి తిరుపతి చిక్కుల శ్రీనివాస్ దాసరి శంకర్ అభ్యంగుల కొమురయ్య దాసరి శంకర్ దాసరి రాజేష్ కామెరా నరేష్ చొప్పరి శ్రీనివాస్ గీసా రవి మార్కాపరసరం బొంగోని వీరన్న బంగారి వెల్డింగ్ రవి తాటికొండ శేఖర్ కలువల ప్రకాష్ మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

**నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్- ఔట్సోర్సింగ్, వర్కర్లను తొలగించొద్దు**

**కాంట్రాక్ట్- అవుట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

**సిఐటియు కామనూరు శ్రీనివాస్ రెడ్డి**

**బద్వేలు :** బద్వేల్ పట్టణం నందు సిఐటియు విస్తృతస్థాయి సమావేశం పి.సి కొండయ్య అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాలు రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో స్కీమ్ కార్మికుల తొలగింపులు అపాలని సిఐటియు జిల్లా కమిటీ కోరింది. గతంలో పరిష్కారం కాని సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందని అంగన్వాడీలు, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ కార్మికులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీ కింది స్థాయి నాయకులు స్థానికంగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను పని మానేయాలని బెదిరిస్తున్నారని, తద్వారా వారి మనుషులను పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ఒక అంగన్వాడీ వర్కర్ ఈ ఒత్తిడి తట్టుకోలేక ఆస్పత్రిలో చేరాల్ని వచ్చిందని వివరించారు. ఇదే జిల్లాలో మరో రెండు చోట్ల హెల్పర్లను బయటకు పంపి తమ వారిని పనిలో పెట్టుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. అనంతపురం జిల్లా వజ్రకరూరులో కూడా మధ్యాహ్న భోజన కార్మికురాలిపై స్థానిక అధికార పార్టీ నాయకులు దాడి చేశారని వివరించారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక పురుగుమందు తాగి ఆమె చావుబతుకుల్లో ఉందని తెలిపారు. ఇతర కార్మికులపై కూడా ఒత్తిడి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీలు మారినప్పుడల్లా కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినవారు స్కీం వర్కర్లపై దాడి చేయడం ఒక రివాజుగా మారిందని విమర్శించారు. వర్కర్ల పని పరిస్థితులకు సంబంధించి కొన్ని విధి విధానాలున్నాయని పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

**సహకార సంఘాల అభివృద్ధి లో రైతులు భాగ స్వాములు కావాలి**

**ఛైర్మన్ అధ్యక్షులు అలసకాని జనార్దన్**

**చిలుకూరు లో ఘనంగాఅంతర్జాతీయ సహకారదినోత్సవం**

**సూర్యాపేట :** రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం అని చిలుకూరు పిఏసీఎస్ ఛైర్మన్ అలసకాని జనార్ధన్ అన్నారు. శనివారం చిలుకూరు పిఏసీఎస్ లో 102 వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార బ్యాంకులో జెండా ఎగుర వేసి మాట్లాడారు.ప్రతి ఏడాది జూలై మొదటి శనివారం ఈ దినోత్సవం జరుపుకుంటామని దీనికి ముఖ్య ఉద్దేశం సహకార రంగం పట్ల అవగాహన పెంచడం అన్నారు. సహకార ఉద్యమం ద్వారా అంతర్జాతీయ సంఘీభావం, ఆర్థిక సామర్థ్యం , సమానత్వం ప్రపంచ శాంతి కొరకు ప్రోత్సహించే దిశలో ఆలోచించడం అన్నారు. సహకార సంఘాలు ఏర్పడ్డాకనే రైతుల జీవితాలలో మార్పులు వచ్చాయని అన్నారు. ఒకప్పటి కంటే ఇప్పుడు సహకార సంఘం బ్యాంకులు అన్ని సదుపాయాలు రైతులకు కలిగిస్తున్నాయని అన్నారు. రైతులకు, డైరెక్టర్ లకు సహకార దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిలువేరు లక్ష్మీనారాయణ ,డైరెక్టర్స్ కొండా సోమయ్య, కస్తూరి సైదులు, కోడారు రాంబాబు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com